

పత్రాలు, ఫొటోలు ప్రదర్శిస్తున్న బాధితులు

మా ప్లాట్లపై కన్నేశాడు!

- మంత్రి బంధువునంటూ వేధింపులు, రౌడీలతో బెదిరింపులు
- పైసా పైసా కూడబెట్టి కొన్నాం... సుప్రీంకోర్టులోనూ గెలిచాం
- అయినా రెండుసార్లు గదులు, ప్రహరీ కూల్చివేయించాడు
- రక్షణ కల్పించాలన్న సోమలింగేశ్వర నగర్ బాధితులు

పంజాగుట్ట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పైసా పైసా కూడబెట్టి కొనుక్కున్న తమ ప్లాట్లను నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ మంత్రి బంధువునని చెబుతున్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేయాలని చూస్తున్నాడని హయత్ నగర్‌లోని సోమలింగేశ్వర నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది. సుమారు రూ.150 కోట్ల విలువ చేసే 101 ప్లాట్లపై ఆ కబ్జాదారు కన్నుపడిందని, రెండుసార్లు గదులు, ప్రహరీ గోడ కూల్చివేయించాడని, రౌడీలతో భయపెడుతున్నాడని పేర్కొంది. హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తమకు, తమ ప్లాట్లకు రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు టీ చంచల్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంవీ రావు, కోశాధికారి వై.కృష్ణమూర్తి, బాధితులు సుధారాణి, మూర్తిరాజు తదితరులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. బాగ్ హయత్ నగర్‌లోని సర్వే నెంబర్లు 180, 187లలో ఉన్న సుమారు 9.20 ఎకరాల్లో పట్టాదార్లు జల్లా భిక్షపయ్య, ఆయన కుమారులు, జల్లా అచ్చిలింగం, రిజిస్టర్డ్ జీపీఏ హోల్డర్ జల్లా అయిలు 101 ప్లాట్లు ఏర్పాటుచేసి రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా 1983 నుంచి 1986 మధ్య విక్రయించగా కొనుగోలు చేశామన్నారు. అప్పటి నుంచి తమ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. కొంతమంది ప్లాట్ల చుట్టూ గోడలు కట్టుకోగా, మరి కొంత మంది గదులు నిర్మించుకున్నారని తెలిపారు. తమ ప్లాట్లపై స్థానికంగా ఉండే వేమిరెడ్డి సురేందర్ రెడ్డి కన్నుపడిందని, అప్పటి నుంచి తమకు ఇబ్బందులు, బెదిరింపులు మొదలయ్యాయన్నారు. తమకు విక్రయించిన పట్టాదార్లు, వారి రెండో తరం వారు కుమ్మక్కై పార్టిషన్ దావా దాఖలు చేసుకున్నారన్నారు. తర్వాత లోక్ అదాలత్‌లో రాజీ పడి తప్పుడు పత్రాలు సృష్టించారన్నారు. తమ ప్లాట్లను వ్యవసాయ భూమిగా చూపించి, 2024లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు సురేందర్ రెడ్డి, జీ వెంకట్‌రెడ్డిలకు విక్రయించారన్నారు. అప్పటి నుంచి కింది కోర్టు మొదలుకుని సుప్రీంకోర్టు వరకు న్యాయం కోసం పోరాడగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. స్థానిక తహసీల్దార్ విచారణ జరిపి ఆన్‌లైన్ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 180, 187లలో ఉన్నది వ్యవసాయ భూమి కాదని, ఇంటి స్థలాలుగా నిర్ధారించారన్నారు.

అయినా కూడా సురేందర్ రెడ్డి తమను వేధిస్తున్నాడని, రెండుసార్లు ప్రహరీ గోడలు, గదులు కూల్చివేయించాడన్నారు. అతనిపై పలు సివిల్, క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. తనను ఎవరూ ఏమీ చేయలేరని, తాను నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ మంత్రి బంధువునని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. రౌడీలతో దాడులు చేయిస్తున్నాడన్నారు. తప్పుడు పత్రాలతో ప్రతి భూమిలో వివాదాలు సృష్టించడం, లోక్ అదాలత్‌లలో రాజీ చేసుకుని భూములు, డబ్బు వసూలు చేయడం ఆయన నైజమని ఆరోపించారు. తమ భూములపై ఆయనకు ఎలాంటి హక్కులు లేవని, వాటిని ఎవరూ కొన్ని మోసపోవద్దన్నారు. ఈ సమావేశంలో బాధితులు టీ సూర్యనారాయణ, శ్రీనివాస్, ఏ కృష్ణమూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో ఆధునిక భవనం

మానసిక చికిత్సాలయంలో నిర్మించనున్న ఆధునిక భవనం నమూనా

- రూ. 30 కోట్ల కేంద్ర నిధులతో జీప్లస్ వన్ పద్ధతిలో నిర్మాణం
- రెండు రాష్ట్రాల మానసిక రోగులకు మెరుగైన వైద్యం



ఎర్రగడ్డ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో నిర్మిస్తున్న ఆధునిక భవనం పూర్తయిన తరువాత రెండు తెలుగు రాష్ట్రాల్లోని మానసిక రోగులకు అధునాతనమైన వైద్య సదుపాయాలు అందుతాయి. సుమారు రూ.30 కోట్ల కేంద్ర బడ్జెట్‌తో భవన నిర్మాణం జరుగుతోంది. జీప్లస్ వన్ పద్ధతిలో భవనాన్ని నిర్మిస్తున్నారు. భవనంలో అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం, అక్యూట్ సైకియాట్రిక్ కేర్ యూనిట్ (ఏపీసీయూ), డీఅడిక్షన్ సెంటర్, రిహాబిలిటేషన్ సెంటర్, సైకియాట్రిక్ నర్సింగ్ విభాగం, వివిధ కోర్సులకు సంబంధించిన విభాగాలు, క్లినికల్ సైకాలజీ, మెడికల్ సోషల్ వర్కర్స్ విభాగాలు, మెడికల్ కాలేజీలకు అనుసంధానం, పీజీ కోర్సులు, ఆయా డిపార్ట్‌మెంట్‌లకు తగ్గట్టుగా కోర్సులను ఇక్కడ ఏర్పాటు చేస్తారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవనంలో వీటి ఏర్పాటుతో ఉభయ రాష్ట్రాల్లోని మానసిక చికిత్సాలయాల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఆధునిక వసతులతో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. మానసిక రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలలో నాణ్యతను పెంచడానికి భవనం పూర్తిస్థాయిలో ఉపయోగపడుతుంది.



ఏరియల్ వ్యూ

2030 నాటికి 15% పెరగనున్న రోగులు

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలోని రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. వైద్య సదుపాయాలలో నాణ్యతను పెంచడానికి, ఆస్పత్రిలో మ్యాన్ పవర్‌ను పెంచుకోవడానికి ప్రస్తుతం నిర్మిస్తున్న సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ భవనం ఎంతో ఉపయోగపడుతుంది. ఆ సంఖ్య 2030 సంవత్సరానికి 15 శాతానికి పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో మ్యాన్‌పవర్‌ను పెంచే దిశలో భాగంగానే భవననిర్మాణ జరుగుతోంది. తెలంగాణలోని రోగులకు అందుతున్న సేవలతోపాటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రోగులకూ సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ భవనం ద్వారా సమాంతరంగా సేవలందించడానికి ఉపయోగపడుతుంది. కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఆస్పత్రి నిర్వహణ కొనసాగిన అనంతరం, ఈ భవనం రాష్ట్రప్రభుత్వం ఆధీనంలోకి వస్తుంది. 2025లోపు భవన నిర్మాణ పనులు పూర్తిచేసి మానసిక రోగులకు అవసమైన సదుపాయలతో అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.

- డాక్టర్ అనిత రాయిరాల, ఆస్పత్రి సూపరింటెండెంట్

అభివృద్ధి పేరుతో చిరువ్యాపారుల పొట్టకొట్టొద్దు



గురుద్వారా సమీపంలో చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట, నవంబర్ 9(ఆంధ్రజ్యోతి): సుందరీకరణ, అభివృద్ధి పేరుతో చిరువ్యాపారుల పొట్టకొట్ట వద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక మార్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు మారేడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి, అభివృద్ధి పనుల పేరుతో అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. శనివారం అమీర్‌పేటలోని హనుమాన్ ఆలయం, కనకదుర్గా ఆలయాల పరిధిలో వివిధశాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికంగా చిరువ్యాపారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కొన్నేళ్లుగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, రోడ్ల అభివృద్ధి, సుందరీకరణ పేరుతో వ్యాపారాలు చేసుకోకుండా అడ్డుకుంటున్నారని వివరించారు. అమీర్‌పేట సర్కిల్ నుంచి హనుమాన్ ఆలయం, కనకదుర్గమ్మ ఆలయం, గురుద్వారా, మైత్రివనం తదితర ప్రాంతాల్లో తోపుడుబండ్లు, ఫుట్‌పాత్‌లపై వివిధ వ్యాపారులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని వెల్లడించారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని చిరు వ్యాపారులు ఆందోళన చెందవద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమార్, ఈఈ వెంకటనారాయణ, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, డీజీఎం వంశీ, ఏడీ సుధాకర్, స్ట్రీట్‌లైట్ ఏఈ శ్రీనివాస్, ఎస్ఐ శావణ్, ట్రాఫిక్ ఎస్ఐలు, మార్చెంట్ అసోసియేషన్ ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు పాల్గొన్నారు.

బీఎస్పీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



వెంకటేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న బీఎస్పీ నగర ఇన్‌చార్జి రమేష్

బంజారాహిల్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షుడిగా ఎల్లారెడ్డిగూడకు చెందిన ఏడల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా రాజు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బీఎస్పీ నగర ఇన్‌చార్జి దోరపల్లి రమేష్, సికింద్రాబాద్ ఇన్‌చార్జి బండారి శ్రీనివాస్ వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పార్టీల పనితీరుపట్ల ప్రజలు సంతృప్తిగా లేరని, వారు ప్రత్యామ్నాయ పార్టీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు.బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్న బీఎస్పీకి ఆదరణ లభిస్తుందన్నారు. బీఎస్పీని నియోజకవర్గంలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

కాలనీలలో నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

- కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్

యూసుఫ్‌గూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాలనీలలో పనిచేయని వీధి దీపాల స్థానంలో నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని యుసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ప్రగతినగర్ కాలనీలో అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. స్థానికులను, కాలనీ అసోషియేషన్ సభ్యులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ న్యాక్ ఏఈ వెంకటేష్‌తో కాలనీలో సీసీ రోడ్లు, గణేష్ ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డు వేయడానికి కొలతలు తీసుకుని వెంటనే ఎస్టిమేషన్ తయారు చేసి పంపాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బలపాక నర్సింగ్‌దాస్, ప్రగతినగర్ అసోసియేషన్ సభ్యులు రాజ్‌గోపాల్, వెంకటరత్నం, సుశీల, నిర్మల, మురళి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ గణపతి పెయింటింగ్ బహూకరణ



ఉత్సవ కమిటీ ప్రతినిధులకు గణపతి పెయింటింగ్‌ను అందజేస్తున్న ఆర్టిస్టు లావణ్య

ఖైరతాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నతనంలోనే ఆర్టిస్టుగా గుర్తింపు పొందిన యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఆర్టిస్టు నమోజు లావణ్య గణపతి ఉత్సవాల్లో తాను లైవ్‌గా చిత్రీకరించిన ఖైరతాబాద్ గణపతి పెయింటింగ్‌ను నిర్వాహకులకు అందజేసింది. శనివారం ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్ దంపతులు, కన్వీనర్ సందీప్‌రాజ్, వీణామాధురిలకు తాను వేసిన పెయింటింగ్‌ను బహూకరించింది. ఇప్పటివరకు స్వర్ణగిరి, జలనారాయణ స్వామి, భద్రాచలం రామాలయం, వేయిస్తంభాల గుడి, చార్మినార్, ఆదివాసీల జీవిత చరిత్ర తదితర పెయింటింగ్ వేసింది. ఖైరతాబాద్ గణపతి ముందుండి అప్పటికప్పుడే పెయింటింగ్ వేసి దాన్ని నిర్వాహకులకు బహూకరిరంచారు. ఆర్టిస్టు లావణ్యను సత్కరించి ఉత్సవ కమిటీ, భవిష్యత్‌లో మంచి ఆర్టిస్టుగా ఎదగాలని ఆకాంక్షించారు.

అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల మౌనదీక్ష

- జేఎన్ఏఎఫ్ఏయూకి భూ కేటాయింపులను వ్యతిరేకిస్తూ కొనసాగుతున్న నిరసనలు



డా.బి.ఆర్ అంబేద్కర్ వర్సిటీలో మౌనదీక్ష చేస్తున్న ఉద్యోగులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రి విశ్వవిద్యాలయంలో పది ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఏఎఫ్ఏయూ)కు కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్యకార్యాచరణ సమితి సభ్యులు నిరసనను కొనసాగిస్తున్నారు. అధ్యాపక, అధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలు శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి మౌనదీక్ష నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ వచ్చి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. జేఏసీ కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, డా.డి.రవీంద్రనాథ్ సోలమన్ మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రకారం ఏ విశ్వవిద్యాలయానికి అయినా కనీసం 60-100 ఎకరాలు ఉండాలని పేర్కొన్నారు. నిరసనలో జేఏసీ సెక్రటరీ జనరల్ డా.పి.వేణుగోపాల్ రెడ్డి, ప్రొ.జి.పుష్పా చక్రపాణి, ప్రొ.చంద్రకళ, డా.ప్రమీల కేతవత్, డా.బి.శ్రీనివాస్, రజనికాంత్, రాములు, డా.అవినాష్, డా.కిషోర్, అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోషియేషన్, కాంట్రాక్టు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



అభివాదం చేస్తున్న బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు రామకృష్ణయ్య, తదితరులు

ఆ కులాన్ని బీసీ జాబితాలో చేర్చవద్దు

పంజాగుట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధికి కులగణన వెన్నుముక లాంటిదని బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు పాలూరు రామకృష్ణయ్య అన్నారు. తెలంగాణలో రెడ్డి గాండ్ల కులాన్ని బీసీ జాబితాలో చేర్చవద్దని డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ సంఘాలు, ఫ్రంట్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కులగణన చేసి విద్య, ఉద్యోగ,స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలని అన్నారు. దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టాలని, ఇందుకోసం బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ జాతీయ నాయకత్వాన్ని సానుకూల నిర్ణయం తీసుకునేలా ఒప్పించాలన్నారు. లేకపోతే ఆ పార్టీ నుంచి బయటికి రావాలని డిమాండ్ చేశారు. రెడ్డి గాండ్ల.. బీసీ కులం కాదని, వారిని బీసీ-బీ జాబితాలో చేర్చవద్దని అన్నారు. గతంలో ప్రస్తుత మంత్రి శ్రీధర్‌బాబు మంత్రిగా ఉన్నప్పుడు రెడ్డి గాండ్ల కులాన్ని బీసీ-బీ జాబితాలో చేర్చితే పోరాటం, ఉద్యమాలు చేసి తామే రద్దు చేపించామని అన్నారు. తమ పోరాట ఫలితంగానే వారికి ఇచ్చిన కుల సర్టిఫికెట్ రద్దు అయ్యిందన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మైనర్ బాబు,బెక్కం వెంకట్, ఎస్.తిరుపతి, స్వామి యాదవ్, దుర్కి కుమార్, పంతకాని శ్రీనివాస్, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బీసీ జర్నలిస్టు సంఘాల జేఏసీ లోగో ఆవిష్కరణ



తెలంగాణ బీసీ జర్నలిస్ట్ సంఘాల జేఏసీ లోగోను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

పంజాగుట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ప్రధానపాత్ర పోషిస్తున్న జర్నలిస్టులలో బీసీ జర్నలిస్టుల సంఖ్యే ఎక్కువనని తెలంగాణ బీసీ జర్నలిస్ట్ సంఘాల జేఏసీ ప్రతినిధులు మేకల కృష్ణ యాదవ్,కొత్త లక్ష్మణ్ పటేల్ పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ బీజీ జేఏసీ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. బీసీ కుల జర్నలిస్టు సంఘాల అసోసియేషన్ నుంచి అక్రిడిటేషన్ కమిటీలో ఒకరిని సభ్యులుగా నియమించాలని, ఇంటి స్థలం, బీసీ జర్నలిస్టుల పిల్లల కోసం ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు నీలకంఠం ముదిరాజ్, నరసింహారావు, ఏ.రాజేష్, బి.అమరేందర్, డాక్టర్ రామ్మూర్తి పటేల్, ఎం.శంకర్ పటేల్, చిలుకూరి హరిప్రసాద్, వెంకట్, శివశంకర్ పాల్గొన్నారు.

బేగంపేట మ్యారీగోల్డ్ హోటల్‌లో ఎడ్యుకేషన్ ఫెయిర్

- 13 దేశాల నుంచి హాజరైన 75కు పైగా యూనివర్సిటీల ప్రతినిధులు



ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు

అమీర్‌పేట్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): టెక్సాస్ రివ్యూ అతిపెద్ద ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు హైదరాబాద్ వేదికగా నిలిచింది. అమెరికా, రష్యా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ.. ఇలా దాదాపు 13దేశాలకు చెందిన యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు బేగంపేట్‌లోని హోటల్ మ్యారీగోల్డ్‌లో భేటీ అయ్యారు. విదేశాల్లో చదువుకోవడానికి అవకాశాలను అన్వేషిస్తోన్న సుమారు వెయ్యిమంది అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. విదేశీ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన ప్రతినిధులతో నేరుగా మాట్లాడే అవకాశం కలగడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. భారతదేశంతో విద్యా సంబంధాలను మరింతగా పెంచుకునేందుకు, రాబోయే సంవత్సరాల్లో మరింత మంది భారతీయ విద్యార్థులను ఆకర్షించేందుకు అన్నిదేశాలు ఆసక్తిని చూపడం విశేషం. టెక్సాస్ రివ్యూ సీఈఓ రాజేష్ దాసరి మాట్లాడుతూ.. యూఎస్, యూకేతోపాటు యూరోపియన్ దేశాలు కూడా అసాధారణమైన విద్యా ప్రమాణాలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. అవగాహన పెరిగేకొద్దీ, ఎక్కువ మంది విద్యార్థులు అంతర్జాతీయ విద్యకోసం అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటున్నారని తెలిపారు.





ప్రజల సహకారంతోనే స్వచ్ఛత

కార్పొరేటర్ సంగీత

బేగంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత సాధ్యమని సోమాజిగూడ కార్పొరేటర్ సంగీతయాదవ్ పేర్కొన్నారు. శనివారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పారిశుధ్యకార్మికులకు చెత్తను తరలించే రిక్షాలు, డస్ట్‌బిన్‌లను ఏఎంహెచ్‌వో చంద్రశేఖర్‌తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

పబ్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించి భారీ శబ్దాలతో సంగీతం పెడుతున్న బేబిలాన్ పబ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 10లోని బేబిలాన్ పబ్‌లో గురువారం భారీ శబ్దాలు పెట్టారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు పబ్‌పై దాడిచేసి మేనేజర్ ఆసిఫ్‌ను అరెస్టు చేశారు. యాంప్లిఫైయర్ ఇతర ఎలక్ట్రిక్ ఉత్పత్తులను సీజ్ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

యూసుఫ్‌గూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముఠాను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎం.శ్రీనివాస్, సిహెచ్ అవినాష్, టి.అరుణ్‌కుమార్, డి.నవీన్, రవి, రాములు ముఠాగా ఏర్పడ్డారు. జీటీఎస్ టెంపుల్, జానకమ్మతోట, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో విక్రయిస్తుండగా శనివారం ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 659 గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు, రూ.6వేల నగదు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

ఈఎస్ఐ మెట్రో స్టేషన్ వద్ద బస్సు బీభత్సం

కారును ఢీకొట్టి ఈడ్చు కెళ్ళిన ప్రైవేట్ ట్రావెల్స్



ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు



ధ్వంసమైన కారు ముందు భాగం

ఎర్రగడ్డ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ జాతీయ రహదారిలోని మెట్రోస్టేషన్ వద్ద ట్రావెల్స్ బస్సు శనివారం బీభత్సాన్ని సృష్టించింది. కారును ఢీకొని కొంత దూరం వరకు ఈడ్చుకెళ్ళింది. ఈ ఘటన ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్ ఎదురుగా జరిగింది. ఎర్రగడ్డ నుంచి వస్తున్న హుండాయ్ కారులో వస్తున్న డ్రైవర్ మెట్రోస్టేషన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఎస్సార్‌నగర్ నుంచి వస్తున్న గో టూర్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టి కొంత దూరం వరకు లాక్కెళ్ళింది. అతివేగంతో అజాగ్రత్తగా దూసుకువచ్చిన ట్రావెల్స్ బస్సు.. కారు ముందు భాగాన్ని ఢీకొని లాక్కెళుతుండడంతో రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు, ఇతర వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, కారులో నుంచి డ్రైవర్ కిందకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. కాగా ఈ ప్రమాదంపై ఎవరూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని తెలిసింది.



సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టీలో శనివారం రక్తదాన శిబిరాన్ని కాంగ్రెస్ మహిళా నాయకురాలు కమర్ హామీద ఏర్పాటు చేశారు. దాదాపు 75 మంది రక్తదానం చేశారు.

- అమీర్‌పేట, (ఆంధ్రజ్యోతి)



డిసెంబరు 2న జరిగే తమిళనాడు మాజీ గవర్నర్, దివంగత డాక్టర్ చెన్నారెడ్డి వర్ధంతి కార్యక్రమానికి హాజరుకావాలని గవర్నర్ బిష్ణుదేవ్‌వర్మను ఆహ్వానిస్తున్న బీజేపీ నేత, చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి.

- బేగంపేట (ఆంధ్రజ్యోతి)

అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ ఎంట్రన్స్ పూర్తి

- రేపు సాయంత్రం ఫలితాలు విడుదల

హైదరాబాద్ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ ఎంట్రన్స్ పరీక్ష జూబ్లీహిల్స్ విశ్వవిద్యాలయంలో శనివారం ప్రశాంతంగా ముగిసిందని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధారాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఐ-సెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ కోర్సుల్లో అడ్మిషన్లు పొందొచ్చని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా.బోజు శ్రీనివాస్, కామర్స్ విభాగ డీన్ ప్రొఫెసర్ ఆనంద్ పవార్, సోషల్ సైన్సెస్ విభాగ డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.ఎల్వీకే రెడ్డి, ప్రాంతీయ అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ డా.రాజేందర్‌రెడ్డిలతో కలిసి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఎంబీఏ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలను సోమవారం సాయంత్రం విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంబీఏ సహా డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు నవంబరు 15 చివరి తేదీగా అధికారులు తెలిపారు. వివరాల కోసం www.braouonline.in లేదా www.braou.ac.in వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.78 వేలు అందజేత



చెక్కు అందజేస్తున్న స్టేషన్ సిబ్బంది

ఖైరతాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అకస్మికంగా మృతిచెందిన సింహగిరికుటుంబాన్ని పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆర్థికంగా ఆదుకున్నారు. సెలవుపై సొంతూరుకెళ్లిన సింహగిరి అక్టోబరు 17న విజయనగరంలోని తన స్వస్థలంలో చెరువులో విగతజీవిగా కనిపించారు. అతడి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. హోంగార్డు కుటుంబాన్ని ఆదుకునే ఉద్దేశంతో సైఫాబాద్ ఏసీపీతోపాటు ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు, సిబ్బంది తలా కొంత వేసుకుని మొత్తం రూ. 78 వేల నగదును సిబ్బంది ద్వారా ఆదివారం ఆయన భార్య భవానికి, తల్లి రామలక్ష్మికి అందజేశారు.

ట్రాఫిక్‌పై స్పెషల్ డ్రైవ్

- సికింద్రాబాద్‌లో ఉదయం సాయంత్రం వేళల్లో విపరీతమైన రద్దీ
- వాహనదారుల బేజారు
- ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు

అడ్డగుట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నార్త్ జోన్ పరిధిలోని మహాకాళి, బేగంపేట్, గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు అదనపు ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు శ్రమిస్తున్నారు. వాణిజ్యకేంద్రంగా ఉన్న సికింద్రాబాద్‌లో ఉదయం సాయంత్రం వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఉప్పల్ నుంచి సికింద్రాబాద్ సంగీత్ మీదుగా వెళ్లే వాహనాలు, తిరుమలగిరి, జూబ్లీబస్టాండు నుంచి వచ్చే వాహనాలు ప్యాట్నీ సెంటర్, హరి హర కళా భవన్ వద్ద ఉదయం 11 గంటల లోపు తీవ్రమైన రద్దీ ఉంటుంది. హరిహరికళాభవన్, ప్యాట్నీ సెంటర్ వద్ద ట్రాఫిక్ పై అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్లకార్డుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా ప్యారడైజ్ నుంచి ప్యాట్నీ సెంటర్ మీదుగా వెళ్లే వాహనాలతో పాటు ఉదయం వేళల్లో ప్యాట్నీ సెంటర్ నుంచి ట్యాంక్ బండ్ వైపు, సాయంత్రం వేళల్లో ట్యాంక్ బండ్ నుంచి సికింద్రాబాద్ వైపు సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటలకు వరకు విపరీతమైన ట్రాఫిక్ ఏర్పడుతుంది. రాణిగంజ్ వైపు ప్రాంతాల్లో దుకాణ సముదాయాల ముందు అక్రమంగా పార్కింగ్ చేస్తున్న భారీ వాహనాలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికి సిటీ లైట్ హోటల్ వద్ద ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్, బాటా చౌరస్తా వద్ద ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉండడం వల్ల కొంతవరకు ట్రాఫిక్ సమస్య తీరుతోంది. ముఖ్యంగా రాణిగంజ్, ప్యారడైజ్, ఎస్పీ రోడ్డు, చర్మాస్ రోడ్డు మార్గంలో చిన్న చిన్న రోడ్లు ఉండడం కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటయినా సికింద్రాబాద్‌లో కొంత ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.



ప్యాట్నీ సెంటర్ వద్ద స్పెషల్‌డ్రైవ్ చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లు

సాయంత్రం అయితే నరకమే

సికింద్రాబాద్‌లోనే ట్రాఫిక్ సమస్య ప్రాంతమైన సికింద్రాబాద్‌సంగీత్ చౌరస్తా. జనగాం, బోనగిరి, ఉప్పల్ మెట్టుగూడ ప్రాంతం నుంచి భారీ వాహనాలు, ఇసుక లారీలు, ఆర్టీసీ ప్రైవేట్ బస్సులు, ఎయిర్‌పోర్టు బస్సులు ఈ వైపు నుంచి సికింద్రాబాద్ వైపు రావాలంటే సంగీత్ చౌరస్తా మీదుగా పోవాలి. ఉదయం 11 లోపు ట్రాఫిక్ అంతంత మాత్రమే ఉన్నా, సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు నరకకూపంగా మారుతోంది.

త్రిబుల్ రైడింగ్‌పై అవగాహన

సికింద్రాబాద్ మహాకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్యాట్నీ సెంటర్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం, బైకుపై త్రిబుల్ రైడ్, డాక్యుమెంట్లు లేకపోవడం, ప్రభుత్వ రంగాలకు సంబంధించిన సైరన్‌లు ఉపయోగించడం వాటిపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సిగ్నల్ పడితే చాలు రెండు కిలోమీటర్ మేర అంతరాయం ఏర్పడుతోంది.

వాహనదారుల్లో చైతన్యం రావాలి



సికింద్రాబాద్‌లో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేందుకు ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. పాఠశాల, కళాశాల, ప్రభుత్వ ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న కార్యాలయాలతో పాటు స్కూళ్లకు వెళ్లి ట్రాఫిక్‌పై అవగాహన కల్పి స్తున్నాం. పాఠశాలలు, కళాశాలలకువెళ్లి విద్యార్థులకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. ప్రతి చౌరస్తాలో నిబంధనలపై బ్యానర్లను ఏర్పాటు చేశాం.

- నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

కనులపండువగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

బౌద్ధనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నామాలగుండులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయచైర్మన్ నోముల ప్రకాశరావు, ఇందిరా దంపతుల ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వస్వామి వారి కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సింహయాలినిని ఆలయచైర్మన్ నోముల ప్రకాశరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పలువురు నాయకులకు వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బిట్ల రఘునందన్‌కుమార్, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బౌద్ధనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరాటేపోటీల్లో సీతాఫల్‌మండికి చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన కరాటేపోటీల్లో ఆర్బీ కరాటే బుడోకాన్ విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్, సీనియర్, గర్ల్స్ విభాగంలో పాల్గొన్న అజ్ఞాన్, ఎ.స్వాతిక్, అక్షిత్, మహిధర్, భరత్, శశాంక్‌లు బంగారు పతకాలను గెలుచుకోగా మరికొంత మంది విద్యార్థులు రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం



జగిరి శ్రీధర్, రేష్మ బేగం

బోయిన్‌పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన ఓల్డ్ బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిరి శ్రీధర్ (38) తన భార్య అనితతో కలిసి సాయికృష్ణకాలనీలో ఉంటూ కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. జగిరి శ్రీధర్ మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. అయితే శుక్రవారం వ్యాపారానికని వెళ్లిన భర్త ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భార్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బస్టాప్‌లో దిగిన మహిళ..

మరో ఘటనలో చాంద్రాయణగుట్ట పూల బాగ్‌కు చెందిన కూరగాయల వ్యాపారి సయద్ హుస్సేన్ భార్య రేష్మ బేగం (50) ఓల్డ్ బోయిన్‌పల్లి హస్మత్‌పేట్‌లో ఉంటూ శుక్రవారం తన కుమారుడి ఇంటికి వచ్చింది. అనంతరం తిరుగు ప్రయాణం కోసం కుమారుడు తల్లి రేష్మ బేగంను ఓల్డ్ బోయిన్‌పల్లిలో బస్సు ఎక్కించాడు. అయితే ఆమె ఇంటికి చేరుకోలేదు. శనివారం భార్య కోసం తండ్రి కుమారుడికి ఫోన్ చేయగా తల్లిని బస్సు ఎక్కించానని తెలిపాడు. తన ఫోన్ కూడా పనిచేయక పోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు ఘటనలను బోయిన్‌పల్లి పోలీసులు మిస్సింగ్ కేసులుగా నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.


తుకారాంగేట్‌లో ఓటరు సవరణ కేంద్రాన్ని సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు

ఓటరు నమోదును వినియోగించుకోండి

అడ్డగుట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకే వస్తున్న ఓటరు నమోదు సవరణ కేంద్రాన్ని వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ టీపీసీ కేకేసీ సికింద్రాబాద్ జిల్లా చైర్మన్ గంట రాజుసాగర్ కోరారు. శనివారం తుకారాంగేట్‌లో నిర్వహించిన ఓటరు సవరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటి నెంబరు మార్పు లేదంటే పేర్లు తప్పులున్నా ఈ కేంద్రలో సవరణ చేసుకోవాలని సూచించారు. నేడు ఆదివారం కూడా అధికారులు బూతు ఏరియాలో అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హరితో పాటు పలువురు పాల్గొన్నారు.


చెత్త రిక్షాలు, డబ్బాలను అందజేస్తున్న కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు

స్వచ్ఛతకు ప్రజల సహకారం అవసరం : కార్పొరేటర్

బేగంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతకు ప్రజల సహకారం అవసరమని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్ అన్నారు. శనివారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు చెత్త రిక్షాలు, డబ్బాలను అధికారులతో కలిసి అందజేశారు. చెత్త రిక్షాలు 8.50 డస్ట్‌బిన్ డబ్బాలను జీహెచ్ఎంసీ సర్కిల్ 17 ఏ ఎమ్ హెచ్ ఓ చంద్రశేఖర్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెత్తను రిక్షాలు, స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలని, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వేయవద్దన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.


బాలుర విజేతలతో నిర్వాహకులు

క్రీడాస్ఫూర్తితో పరీక్షలకు సిద్ధం కావాలి : ఒడ్డెన్న

రాంగోపాల్‌పేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడాస్ఫూర్తితో పరీక్షలకు సిద్ధం కావాలని డీఐఈఓ ఒడ్డెన్న పిలుపునిచ్చారు. శనివారం సికింద్రాబాద్ పీజీ రోడ్డులోని వెస్లీ బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖో ఖో లీగ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. బాలుర పోటీలలో మొదటి స్థానం వరంగల్, ద్వితీయ స్థానంలో హైదరాబాద్, తృతీయ రంగారెడ్డి జిల్లాల జట్లు, బాలికలకు నిర్వహించిన పోటీలలో మొదటి స్థానంలో మహబూబ్ నగర్, ద్వితీయ స్థానంలో హైదరాబాద్, తృతీయ స్థానంలో రంగారెడ్డి జిల్లాల జట్లు నిలిచాయి. ఈ లీగ్‌దశ పోటీలలో 15 మంది క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ప్రాబబుల్స్ గా ఎన్నుకున్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బౌద్ధనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధిమార్గాల ద్వారా ఆర్థిక ప్రగతి సాధించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం సీతాఫల్‌మండిలో ఎస్‌పీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన సికింద్రాబాద్ నియోజకవర్గ స్వయం సంఘాల మహిళా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించటం ద్వారా సామాజిక ప్రగతి సాధించవచ్చన్నారు. ఇంటిపట్టున ఉంటున్న మహిళలందరినీ స్వయం సహాయక బృందాల్లో చేర్పించి ఉపాధి అవకాశాలు చూపించేందుకు మహిళా సంఘాల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రధాని నేతృత్వంలో కేంద్రప్రభుత్వం మహిళా సంక్షేమం, ప్రగతి కోసం అమలుచేస్తున్న పథకాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలకు అవసరమైన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, మహాకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, నియోజకవర్గ ఇంచార్జులు కాంతారావు, జయశ్రీ, కార్పొరేటర్లు రచనశ్రీ, సుప్రియ, దీపిక పాల్గొన్నారు.


స్వయం సంఘాల మహిళా ప్రతినిధులతో కిషన్‌రెడ్డి



డిసెంబరు 2న జరిగే మాజీ సీఎం, తమిళనాడు మాజీ గవర్నర్ చెన్నారెడ్డి 28వ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని గవర్నర్ బిష్ణుదేవ్ వర్మను ఆహ్వానిస్తున్న బీజేపీ నేత, చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రిశశిధర్‌రెడ్డి.
- బేగంపేట, (ఆంధ్రజ్యోతి)

సమగ్ర సర్వేకి సహకరించండి : జంపన ప్రతాప్

బోయిన్‌పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేకి ప్రజలందరూ సహకరించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కోరారు. సర్వే సిబ్బంది ఎన్యుమరేటర్లు ప్రతాప్ నివాసంలో సర్వే నిర్వహించి ఆయన ఇంటికి స్టిక్కర్‌ను అతికించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ సర్వే కోసం ఇంటికి వచ్చిన అధికారులతో దురుసుగా ప్రవర్తించకుండా వారడిగిన వివరాలను తెలపాలని కోరారు. సర్వే ఎన్యుమరేటర్లు కూడా ఇళ్లకు వెళ్లినప్పుడు ఆయా కుటుంబ సభ్యులతో మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. తమ కుటుంబ సభ్యులతో పాటు సోదరుడి కుటుంబ సభ్యుల వివరాలను తెలిపామని అన్నారు. కార్యక్రమంలో దఫేదార్ విజయ్, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.


సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

కులగణనపై అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళలు

మారేడుపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కులగణన కార్యక్రమంలో భాగంగా శనివారం మారేడుపల్లి జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో అధికారులు సమావేశం నిర్వహించారు. యూసీడీ విభాగం జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సమాచార సేకరణ సర్వే విధానంపై ఆయన సిబ్బందికి అవగాహన కల్పించారు. కులగణనకు అవసరమయ్యే సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిబ్బంది కొరత లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని యూసీడీ విభాగం జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెట్ బోర్డు పరిధిలో 263 మంది సిబ్బంది, 19 మంది సూపర్‌వైజర్లు, కులగణన సర్వే చేసేందుకు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఏఓ పాల్‌సింగ్, కంటోన్మెంట్ బోర్డు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పుష్పేంద్ర గుప్తా, ఐకేపీ కో ఆర్డినేటర్ ప్రకాష్, యూసీడీ అధికారి శ్రీనాథ్ సర్వే సిబ్బంది అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

కులగణన సర్వేలో ఉపాధ్యాయులను మినహాయించాలి

అడ్డగుట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటి కుల గణన సర్వే కార్యక్రమానికి హాజరవుతున్న ఉపాధ్యాయులను మినహాయించాలని కోరుతూ ఎంవీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఏవీ స్వామి, కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ శనివారం విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశంకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ బడుల్లో చదువు చెప్పకుండా సర్వే పేరుతో వెళుతున్న ఉపాధ్యాయులకు మినహాయించాల్సిన అవసరం ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. విద్యాశాఖ ప్రధాన కార్యదర్శిని కలిసిన వారిలో లక్ష్మీనారాయణ, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు కృష్ణ పాల్గొన్నారు.


బుర్ర వెంకటేశంకు వినతి పత్రం సమర్పిస్తున్న ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు

నూర్ అహ్మద్ ఆలీ సేవలు అభినందనీయం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైలు, బస్సు ప్రయాణికుల సంక్షేమం కోసం కృషిచేస్తున్న ఆ సంఘం వ్యవస్థాపకులు నూర్ అహ్మద్ అలీ సేవలు అభినందనీయమని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం లోకేష్ విష్ణుయ్ అన్నారు. శనివారం మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో సబర్బన్ రైళ్లు, బస్సు ప్రయాణికుల సంఘం 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాలకి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు ఏకే సింగ్, ఫిర్దస్ ఖాన్, సీనియర్ డీసీఎం కిరణ్ కుమార్, అనిరుద్, సీనియర్ డీఈఈ అధికారి శశాంక్ నామ్‌దేవ్, సంఘం ప్రతినిధులు వీరస్వామి, బాల గంగాధర్, విజయప్రసాద్ రెడ్డి, సుధ, కరీమ, శంకర్‌రావు పాల్గొన్నారు.


రైల్వే డీఆర్ఎం లోకేష్ విష్ణువ్‌ను సన్మానిస్తున్న సంఘం అధ్యక్షుడు నూర్ అహ్మద్ ఆలీ

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి : జయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ

బౌద్ధనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పరిధిలో రికార్డుస్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టేందుకు సమాయత్తం కావాలని జిల్లా ఇన్‌చార్జి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ కోరారు. శనివారం నామాలగుండులో నిర్వహించిన సికింద్రాబాద్, సనత్‌నగర్, ముషీరాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల బీజేపీ నాయకుల వర్క్‌షాప్‌కు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ, దేశ ప్రగతి కోసం ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న కృషి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయటం ద్వారా బీజేపీ సభ్యత్వ నమోదును రెట్టింపు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, కందాడి నాగేశ్వరరెడ్డి, కనకట్ల హరి, కార్పొరేటర్లు దీపిక, సుప్రియ, రచనశ్రీ పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులు : హేమ

బౌద్ధనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కాలనీలో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ సామల హేమ, అధికారులతో కలిసి పర్యటించారు. సుమారు రూ.30 లక్షలతో సీసీ రోడ్డుపనులు చేపడుతున్నామని, నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానికులతో సమస్యలపై చర్చించారు. జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, జలమండలి మేనేజర్ నవ్య తదితరులు పాల్గొన్నారు. సీతాఫల్‌మండి డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కార్పొరేటర్, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాంకు విజ్ఞప్తి చేశారు. ముషీరాబాద్ మండల కార్యాలయంలో కార్పొరేటర్, ఆర్డీఓతో సమావేశమయ్యారు.


స్థానికులతో సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రమాదకరం: టీటీఐ రాంచందర్

బోయిన్‌పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరమని రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రమాదకరమని, రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని బేగంపేట (టీటీఐ) ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ వి.రాంచందర్ అన్నారు. హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం బోయిన్‌పల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారన్నారు.

మోటారు వెహికల్ చట్టప్రకారం రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తీసుకోబడుతాయని, ఈ నిబంధనలు అతిక్రమించిన వారికి 6 నెలల వరకు జైలుశిక్ష లేదా వెయ్యి రూపాయలు జరిమానా లేదా రెండూ విధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ మల్లయ్య, రోటరీ క్లబ్ ఇంచార్జి సంజన, ధనలక్ష్మి, సిబ్బంది, కానిస్టేబుల్ ఆయాన్, కృష్ణ పాల్గొన్నారు.


బోయిన్‌పల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్

నిత్యావసర వస్తువుల పంపిణీ

అడ్డగుట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ ఇంటర్ నేషనల్ ఆధ్వర్యంలో నిరుపేద ప్రాంత వాసులకు నిత్యావసర వస్తువుల్ని పంపిణీ చేస్తున్నామని లయన్స్ గవర్నర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం తుకారాంగేట్‌లో బడుగు బలహీన వర్గాల కుటుంబాలను గుర్తించి పంపిణీ చేస్తున్నామన్నారు. దాదాపు 50 కుటుంబాలకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో లయన్స్ నిర్వాహకులు సాయిరాం రాజు, చల్లా శ్రీనివాస్ రెడ్డి, లతా బండారీ, మనోజ్ కుమార్, శ్రీధర్ బాబు, రామిరెడ్డి, పాల్గొన్నారు.


తుకారాంగేట్ వాసులకు నిత్యావసర వస్తువుల్ని పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

సనాతన ధర్మాన్ని కాపాడాలి : విద్యాశంకర భారతీస్వామి


మహారుద్రయాగంలో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి

బౌద్ధనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమస్త మానవళి సుఖసంతోషాలకు మూలమైన ఆధ్యాత్మిక భక్తి భావాన్ని మరింత పెంపొందించి సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి ఉద్బోధించారు. శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుపాదమండపంలో శనివారం రెండోరోజున జరుగుతున్న శ్రీమహారుద్రయాగంలో భారతీస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, ఆలయ కార్య నిర్వహణాధికారి రాజేశ్‌కుమార్, ఆలయ నిర్వాహకులు బాలభాస్కర్, ఆత్మారామసూర్యసుబ్రహ్మణ్యం, షన్ముఖరెడ్డితో పాటు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.